క్లుప్తంగా

నేడు జగ్గంపేటలో గడపగడపకూ..

జగ్గంపేట: గ్రామంలో గురువారం గడపగడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ వసంత కుమార్ తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెసుకుంటారన్నారు. సచివాలయం-2 పరిధిలో నూతనంగా శ్రీరామనగర్ నుంచి గోకవరం రోడ్డుకు అనుసంధానం చేసేందుకు నిర్మించిన కల్వర్టును ఆయన ప్రారంభిస్తారని తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సి.రాయవరంలో పొలంబడి



సి.రాయవరంలో రైతులకు సూచనలిస్తున్న ఏఓ జ్యోతి

ఏలేశ్వరం: మండలంలోని సి.రాయవరంలో బుధవారం వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి బి.జ్యోతి రైతులు, వీఏఏలకు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలకు సస్య రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. విత్తనశుద్ధి చేయడం ద్వారా అధిక దిగుబడులు వస్తాయన్నారు. వరి సాగు చేసిన రైతులు పొలం గట్లపై కంది, బంతి సాగు చేయడం ద్వారా పురుగులు, తెగుళ్లను అరికట్టవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రైతులకు విత్తనాల పంపిణీ

తుని రూరల్: రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని డి.పోలవరం మాజీ సర్పంచ్ చింతల వెంకటరమణ అన్నారు. డి.పోలవరంలో ప్రకృతి వ్యవసాయ ఏరియా కోఆర్డినేటర్ రామకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం ఎస్సీ రైతులకు ఉచితంగా విత్తన కిట్లను పంపిణీ చేశారు. ప్రకృతి వ్యవసాయంతో కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు చిటికెల వరహాల బాబు, పంచాయతీ కార్యదర్శి గోవిందు, రైతులు పాల్గొన్నారు.

లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేసుకోవాలి

తుని రూరల్: పత్తి పంటను ఆశించే గులాబీ రంగు పురుగుల ఉధృతిని గుర్తించేందుకు లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త సీతారామయ్య శాస్త్రి సూచించారు. మండలంలోని టి.తిమ్మాపురంలో బుధవారం శాస్త్రవేత్తలు డాక్టర్ సీతారామయ్య శాస్త్రి, డాక్టర్ సుధీర్ పర్యటించారు. పత్తిపంటలను ఆశిస్తున్న పురుగులను పరిశీలించారు. గులాబీ రంగు పురుగుల ఉధృతిని గుర్తించడంలో లింగాకర్షణ బుట్టలు కీలకపాత్ర వహిస్తాయన్నారు. ఉధృతిని గుర్తించినప్పుడే నివారణకు ఏమోతాదులో మందులు పిచికారీ చేయాలో తెలుస్తుందన్నారు. పురుగుల ఉధృతి, తెగుళ్ల నివారించుకుంటే నాణ్యత గల అధిక దిగుబడులు లభిస్తాయన్నారు. మండల వ్యవసాయ అధికారి బి.అశోక్‌కుమార్, వీహెచ్ఏలు, రైతులు పాల్గొన్నారు.

తుని ఏఎంసీ కార్యదర్శిగా శ్రీనివాసు



తుని: తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) ఇన్‌చార్జి కార్యదర్శిగా డి.శ్రీనివాసరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ రూరల్ నియోజకవర్గం కరప నుంచి ఆయన ఇక్కడకు ఇన్‌చార్జ్‌గా వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్ యార్డులో వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. మార్కెట్ ఫీజు వసూళ్లు, చెక్ పోస్టులు సమర్థవంతంగా నిర్వహించేందుకు చైర్మన్ మాకినీడి బాబు, పాలకవర్గ సభ్యులతో కలిసి పని చేస్తానని తెలిపారు. రైతులు మార్కెట్ యార్డు ఉన్నతికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

అన్నవరం: ర్యాగింగ్ చట్టవిరుద్ధమని, విద్యాసంస్థల్లో ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నవరం ఎస్ఐ కిషోర్ బాబు హెచ్చరించారు. స్థానిక సత్యదేవ జూనియర్ కళాశాల ఆవరణలో బుధవారం మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు అన్నదమ్ముల్లా కలిసి మెలిసి ఉండాలన్నారు. కేసుల్లో ఇరుక్కుంటే విద్యార్థుల భవిష్యత్ నాశనం అవుతుందని తెలిపారు. న్యాయవాదులు రాజాల చిట్టిబాబు, బుగత శివ, ఎ.దేవి, అకాశపు మల్లేశ్వరరావు, రాయి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేటి ధర్నాను విజయవంతం చేయాలి

జగ్గంపేట: పంచాయతీలు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులపై కాకినాడ కలెక్టరేట్ వద్ద గురువారం నిర్వహించే ధర్నాను విజయవంతం బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ దాట్ల కృష్ణవర్మ కోరారు. జగ్గంపేట నియోజకవర్గంలోని సర్పంచులు పార్టీల రహితంగా తరలి రావాలని పిలుపునిచ్చారు.

నులిమేద్దాం

- 19 ఏళ్ల లోపు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ
- ప్రత్తిపాడు నియోజకవర్గంలో 36,724 మందికి మాత్రలు వేయాలని లక్ష్యం
- నేడు జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం

ప్రత్తిపాడు రూరల్: అభంశుభం తెలియని చిన్నారులను అనేక అనారోగ్య సమస్యలు పట్టి పీడిస్తుంటాయి. ముఖ్యంగా అపరిశుభ్రత కారణంగా చుట్టుముట్టే సమస్యలు తల్లిదండ్రులు గమనించే లోపే తీవ్రరూపం దాలుస్తాయి. అందులో నులిపురుగుల సమస్య ఒకటి. వీటి వల్ల రక్తహీనత సమస్య చిన్నారులను తీవ్రంగా బాధిస్తోంది. సరిపడా ఆహారం తీసుకుంటున్నప్పటికీ పిల్లలు పేలవంగా కనిపిస్తుంటారు. అందుకు కారణమైన నులిపురుగుల ప్రభావాన్ని నివారించుకోవాలి. దీని కోసం ప్రభుత్వం క్షేత్ర స్థాయిలో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ చేపట్టింది. తుని, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లోని 11 పీహెచ్‌సీల వైద్య సిబ్బంది గ్రామాల్లోని 1 నుంచి 19 ఏళ్లలోపు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్నారు.

విస్తృతంగా అవగాహన

ప్రతి సంవత్సరం జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా నులి పురుగులపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 19 ఏళ్ల లోపు వారందరికీ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్నారు. నులి పురుగుల ప్రభావం కారణంగా తలెత్తే రక్తహీనత నివారణే లక్ష్యంగా విద్యాశాఖ, మాతాశిశు సంక్షేమ శాఖ, పంచాయితీ రాజ్, జిల్లా పరిషత్ సమన్వయంతో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు మాత్రల పంపిణీ జరుగుతోంది.



ప్రత్తిపాడులో వైద్య సిబ్బందికి ఆల్బెండజోల్ మాత్రలు అందిస్తున్న ప్రజాప్రతినిధులు

నియోజకవర్గంలో..

ప్రత్తిపాడు నియోజకవర్గంలో 36,724 మందికి మాత్రలు పంపిణీ చేస్తున్నారు. ప్రత్తిపాడు మండలంలోని రాచపల్లి పీహెచ్‌సీ పరిధిలో 7,750 మందికి, పెద్దిపాలెం పీహెచ్‌సీ పరిధిలో 4,600 మందికి, శాంతిఆశ్రమం పీహెచ్‌సీ పరిధిలో 3,639, ఏలేశ్వరం పీహెచ్‌సీ పరిధిలో 16,200, శంఖవరం, రౌతులపూడి, శంఖవరం పీహెచ్‌సీ పరిధిలో 9985, పెదమల్లాపురం పీహెచ్‌సీ పరిధిలో 2,300 మంది పిల్లలకు నులిపురుగు నివారణ మాత్రలను అందిస్తున్నారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

పీహెచ్‌సీ	పంపిణీ చేసే మాత్రలు
రాచపల్లి	7,750
పెద్దిపాలెం	4,600
శాంతి ఆశ్రమం	3,639
ఏలేశ్వరం	16,200
శంఖవరం	9,985
పెదమల్లాపురం	2,336

డోసు ఇలా ..

ఆరోగ్య సిబ్బంది ఇచ్చే 400 ఎంజీ అల్బెండజోల్ మాత్రను అవగాహనతో మిగాలి. రెండేళ్ల లోపు చిన్నారులకు సగం మాత్రను నీటిలో కరిగించి స్పూన్‌తో వేయాలి. ఆపైబడిన వారు పూర్తి మాత్రను నమిలి మింగాలి. మాత్రను పరగడుపున వేసుకుంటే కడుపులో తిప్పడం, వాంతులు అయ్యే అవకాశం ఉంది. ఆహారం తీసుకున్న తర్వాతే ఈ మాత్రను మింగాలి.

> **ఆరోగ్య సిబ్బంది పర్యవేక్షణలోనే మింగాలి**
>
> విద్యార్థులు ఆల్బెండజోల్ మాత్రలను వైద్య, ఆరోగ్య కార్యకర్తల పర్యవేక్షణలోనే మింగాలి. కడుపులో నులిపురుగులు పెరగడంతో రక్తహీనతకు లోనవుతారు. శాస్త్రీయ పద్ధతుల్లో ఆహారం తీసుకున్నప్పటికీ వంటపట్టదు. కడుపులో పురుగుల నివారణకు తగిన మోతాదులో ఆల్బెండజోల్ మాత్రను విధిగా వేసుకోవాలి.
>
> – పి.సాహితి, పీహెచ్‌సీ వైద్యాధికారి, పెద్దిపాలెం, ప్రత్తిపాడు మండలం



అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- గోనేడలో గడపగడపకూ మన ప్రభుత్వం

కిర్లంపూడి: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని గోనేడలో బుధవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ అల్లు విజయ కుమార్ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గత నాలుగేళ్లలో ప్రభుత్వ సంక్షేమ పథకాల రూపంలో ప్రతి కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకొచ్చిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. వెళ్లిన ప్రతిగడపలోనూ లబ్ధిదారులు ప్రభుత్వ పాలనపై సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లోనూ ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. తొలిత గ్రామంలో నా భూమి- నా దేశం, నేల తల్లికి నమస్కారం-వీరులకు వందనం కార్యక్రమం ఆయన పాల్గొన్నారు. జాతీయ జెండాను ఆవిష్కరించి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీపీ తోట రవి, తోట గాంధీ, అల్లు శివ రామకృష్ణ ,పేపకాయల గంగాధర్, పసుపులేటి సత్యనారాయణ, జనపరెడ్డి బాబు, చదలవాడ బాబీ, తోట విష్ణు, పెనగంటి రాజేష్, బొడ్డేటి గణపతి, ఇళ్ల అప్పారావుకాపు, ఎంపీడీఓ బడే రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



గోనేడలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

ఘనంగా ఆదివాసీ దినోత్సవం

తుని రూరల్: మండలంలోని వి.కొత్తూరు గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో బుధవారం ఆదివాసీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం వనలత ఆధ్వర్యంలో విద్యార్థినులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. బాలికలు ప్రదర్శించిన గిరిజన సాంప్రదాయ నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు విజయకుమారి, ఆశాజ్యోతి, పలువురు విద్యార్థినులు పాల్గొన్నారు.



వి.కొత్తూరు పాఠశాలలో గిరిజన సంప్రదాయ నృత్యాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

ఆదివాసీ హక్కులను కాపాడుకుందాం

రౌతులపూడి: ఆదివాసీ హక్కులను కాపాడుకుందామని ఎంపీపీ జి.రాజ్యలక్ష్మి, ఆదివాసీల సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంటిమళ్ల సత్యనారాయణ అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక గుమ్మరేగుల సెంటర్‌లోని అల్లూరి సీతరామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీఓ నంబర్-2 నిర్వీర్యం చేయడం వలన ఆదివాసీలు విద్యా, ఉద్యోగ అవకాశాలను కోల్పోతున్నారన్నారు. గిరిజనులు ఏకమై హక్కులు, బాధ్యతలను పరిరక్షించుకోవలసిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ ఉద్యోగులు గంటిమళ్ల అప్పారావు, గంటిమళ్ల నాగేశ్వరరావు, మురిడిండి దేవుడు, తరుణ్ పాల్గొన్నారు.

జగ్గంపేట: ఆదివాసీ గ్రామాల్లో మైనింగ్‌కు ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు కోరారు. జగ్గంపేట మండలం గోవిందపురంలో బుధవారం అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం నిర్వహించారు. పలువురు లిబరేషన్ శ్రేణులు పాల్గొన్నారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు

ఏలేశ్వరం: మండలంలోని తూర్పులక్ష్మీపురంలో బుధవారం పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ పశువైద్య శిబిరాన్ని ఎంపీటీసీ సభ్యుడు యజనగిరి ప్రసాద్ ప్రారంభించారు. సచివాలయ పశువైద్య సహాయకులు ఝాన్సీ రాణి, గంగాధర్, సీతారామ్, సురేష్ పశువులకు చర్మవ్యాధులు రాకుండా ఎల్ఎస్‌డీ టీకాలు వేశారు. ప్రస్తుత వర్షాకాలంలో పశువుల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో రైతులు శిడగం శ్రీనివాస్, మజ్జి సత్యనారాయణ, పతివాడ రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సినీ హీరో మహేష్‌బాబు జన్మదిన వేడుకలు



ప్రత్తిపాడు వృద్ధాశ్రమంలో వృద్ధులకు చీరలను పంపిణీ చేస్తున్న మహేష్‌బాబు అభిమానులు

ప్రత్తిపాడు: సినీ హీరో సూపర్‌స్టార్ మహేష్ బాబు జన్మదిన వేడుకలు ప్రత్తిపాడులో బుధవారం ఘనంగా జరిగాయి. మహేష్‌బాబు అభిమాన సంఘం అధ్యక్షుడు సలాది కృష్ణ ఆధ్వర్యంలో ఆలయాల్లో పూజలు నిర్వహించారు. స్థానిక సిరి మానసిక వికలాంగుల పాఠశాలలో సలాది కృష్ణ కేక్ కట్ చేశారు. వసతి గృహానికి బియ్యం, చింతపండు తదితర నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. అనంతరం స్థానిక శ్రీశారదా వయోవృద్ధ నిలయంలోని మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంబు ప్రభాకర్, వేగి దుర్గారావు, చెవల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కొండపోడు భూములకు పట్టాలివ్వాలంటూ ఆందోళన

ఏలేశ్వరం: కొండపోడు భూములకు పట్టాలివ్వాలని డిమాండ్ చేస్తూ పరిమితడక గ్రామంలో బుధవారం గిరిజనులు ఆందోళన చేశారు. సీపీఐ (ఎంఎల్) వినోద్ మిశ్రా పార్టీ అనుబంధ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మర్రివీడులో గత 30 ఏళ్లుగా సుమారు 300 మంది గిరిజనులు కొండపోడు భూములను సాగు చేసుకుంటున్నారన్నారు. వీరికి ఇప్పటివరకూ పట్టాలు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం సానుకూలంగా స్పందించి పట్టాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాగులాపల్లి అర్జునుడు, సాబే కొమ్మయ్య, సోమాల సంకురు, రమణ, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

నా భూమి-నా దేశం వేడుకలు ప్రారంభం

ప్రత్తిపాడు: అజాదీ కా అమత్ మహోత్సవంలో భాగంగా బుధవారం ప్రత్తిపాడులో 'నా భూమి-నా దేశం, నేలతల్లికి నమస్కారం, వీరులకు వందనం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ప్రత్తిపాడులోని గోవిందరాజుల చెరువు వద్ద జాతీయ పతాకాన్ని, వీరుల శిలాఫలకాన్ని ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ ఆవిష్కరించి వేడుకలను ప్రారంభించారు. స్థానిక శ్రీఅన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామివారి పంచాయతన క్షేత్రం వద్ద సేకరించిన మట్టిని శిలాఫలకం వద్దకు తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ప్రతి సచివాలయం పరిధిలో నా భూమి-నాదేశం కార్యక్రమం వేడుకగా చేపట్టాలని పిలుపు నిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సందేశాలను ఉపాధి హామీ పథకం ఏపీఓ ఏవీబీ నాయుడు వినిపించి, ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం చెరువు గట్టుపై మొక్కలు నాటారు. గ్రామ సర్పంచ్ గుడాల విజయలక్ష్మి, ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శేరు కృష్ణ, డైరెక్టర్ గోళ్ల జయశేఖర్, పంచాయతీ కార్యదర్శి ద్విభాష్యం శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పత్రి రమణ, ఆకుల వీరబాబు, ఏడిద రెడ్డినాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఇండుగపల్లిలో మట్టి కలశంతో ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజాప్రతినిధులు

కోటనందూరు: మండలంలోని ఎస్సార్‌పేట, ఇండుగపల్లి, టీజే నగరం గ్రామాల్లో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా బుధవారం నా మట్టి-నా దేశం కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో అమరవీరుల సంస్మరణార్థం శిలాఫలకాలు ఏర్పాటు చేసి మట్టి కలశం, దీపాలతో ప్రాణప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ లగుడు శ్రీనివాసు, సర్పంచులు కుంచే సత్యవతి, రుత్తల రాజేశ్వరి, సుర్ల రాంబాబు, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ, ఏపీఓ రామచంద్రరావు పాల్గొన్నారు.

అజాదీకా అమృత్ మహోత్సవం

గండేపల్లి: స్థానిక హైస్కూల్‌లో బుధవారం అజాదికా అమృత్ మహోత్సవాన్ని ఎంపీపీ చలగళ్ల దొరబాబు ప్రారంభించారు. దీనిలో భాగంగా ఈ నెల 12 వరకూ అమరవీరులను స్మరించుకోవడం, నేలతల్లికి వందనం, పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ రామన్ తెలిపారు.



ప్రత్తిపాడులో జ్యోతి ప్రజ్వలన నాభూమి-నాదేశం కార్యక్రమాన్ని ప్రారంభిసున్న ప్రజాప్రతినిధులు

పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ

ప్రత్తిపాడు రూరల్: పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ అన్నారు. మండలంలోని ఒమ్మంగిలో ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు ఆధ్వర్యంలో బుధవారం నా భూమి-నా దేశం, నేల తల్లికి నమస్కరం, వీరులకు వందనం కార్యక్రమాలు నిర్వహించారు.

యర్రంపాలెంలో మొక్కలు నాటే కార్యక్రమం

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య ఫార్మసీ కళాశాల విద్యార్థులు బుధవారం మండలంలోని యర్రంపాలెంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ విభాగం ఆధ్వర్యంలో గ్రామంలో మొక్కలు నాటారు. మొక్కల వలన కలిగే లాభాలను గ్రామస్తులకు వివరించారు. గ్రామ సచివాలయ కన్వీనర్ నిమ్మలపూడి శ్రీహరి, ముత్యాల రవి, ఆదిత్య కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

అమృతతుల్యం తల్లిపాలు

తుని రూరల్: బిడ్డకు తల్లిపాలు అమృతతుల్యమని కేఓ మల్లవరం సర్పంచ్ డొంక సత్యవతి అన్నారు. బుధవారం గ్రామంలో అంగన్‌వాడీల ఆధ్వర్యంలో తల్లిపాలు వారోత్సవాలు నిర్వహించారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ అన్నంరెడ్డి వీరరాఘవులు, మాజీ సర్పంచ్ ఏకా కన్నయతో కలసి సర్పంచ్ గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం కిట్లను పంపిణీ చేశారు. తల్లిపాలు ప్రాముఖ్యతను వివరించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు డొంక వెంకటబెనర్జీ, సచివాలయం కార్యదర్శి పైల శివ, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

నానో రసాయన ఎరువులతో పంటలకు మేలు

జగ్గంపేట: నానో రసాయన ఎరువులు వినియోగిస్తే పంటలకు ఎంతో మేలు చేకూరుతుందని ఇఫ్కో రాష్ట్ర మార్కెటింగ్ మేనేజర్ తుమ్మల శ్రీధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కాట్రావులపల్లిలో బుధవారం నిర్వహించిన క్షేత్ర ప్రదర్శనలో ఆయన పాల్గొన్నారు. నానో ఎరువులు, రసాయనాల పనితీరుపై రైతులకు అవగాహన కల్పించారు. త్వరలో డ్రోన్‌లను ఇఫ్కో సంస్థ అందుబాటులోకి తెస్తుందన్నారు. అతి తక్కువ ఖర్చుతో రైతులు ఎరువులు పిచికారీ చేసేలా ప్రణాళికలు రూపొందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఇఫ్కో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మేనజర్ శ్యామ్ ప్రసాద్‌బాబు, రైతులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

తుని: పట్టణంలో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి తెలిపారు. తుని 29వ వార్డు కోరాడ వారి వీధిలో రూ.7.50 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులను బుధవారం ఆమె కొబ్బరి కాయ కొట్టి ప్రారంభించారు. నిధుల లభ్యతను పరిగణలోకి తీసుకుని దశల వారీగా వార్డుల్లో రోడ్లు, కాలవల నిర్మాణ పనులు చేస్తున్నామని తెలిపారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గం అధ్యక్షుడు ఏలూరి బాలు, మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, వైఎస్సార్ సీపీ తుని పట్టణశాఖ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, గాంధీసత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తుని కోరాడ వారి వీధిలో కొబ్బరికాయ కొట్టి సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ సుధారాణి

చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

110 గ్రాముల బంగారం రికవరీ

కిర్లంపూడి: బంగారం చోరీ చేసులో కాకినాడ కుంతీదేవి కాలనీకి చెందిన నిందితుడు పోలినాటి భవానీ శంకర్‌ను అరెస్ట్ చేసినట్లు జగ్గంపేట సీఐ బి.సూర్యఅప్పారావు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఆయన విలేకర్లకు వివరాలు వెల్లడించారు. కిర్లంపూడి మండలం పాలెం గ్రామానికి చెందిన అవసరాల వెంకట సుధాకర్ గత నెల 17న తన తండ్రిని వైద్యం కోసం రాజమహేంద్రవరం ఆసుపత్రికి తీసుకెళ్లాడు. అదే నెల 19న ఇంటికి రాగా ఇంటి తలుపుల తాళాలు తీసి ఉన్నాయి. వెంటనే ఇంటిలోకి వెళ్లి చూడగా బీరువా తెరిచి చూడగా అందులో దాచిపెట్టుకున్న బంగాలు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. వెంటనే సుధాకర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. కాగా బుధవారం సింహాద్రిపురం గ్రామ శివారులో అనుమానాస్పదంగా తిరుగుతున్న భవానీశంకర్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేయగా అసలు నిజం బయటపెట్టాడు. అతని నుంచి 110 గ్రాముల బంగారం, రూ.25 వేలు నగదును రీకవరీ చేసినట్టు సీఐ సూర్యఅప్పారావు తెలిపారు. సమావేశంలో ఎస్సై బి.ఉమామహేశ్వరరావు, హెడ్ కానిస్టేబుల్ వి.విజయ కుమార్, కానిస్టేబుల్ శ్రీనివాసు ఉన్నారు.



కిర్లంపూడి పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడిస్తున్న సీఐ సూర్యఅప్పారావు

విద్యార్థినులకు పీడీ వ్యాక్సిన్లు

తుని రూరల్: మండలంలోని హంసవరం ఏపీ మోడల్ స్కూల్‌లో చదువుతున్న పది, పదహారేళ్ల వయస్సు గల విద్యార్థినులకు బుధవారం పీడీ (పార్కిన్ సన్స్ డిసీజ్) వ్యాక్సిన్లు వేశారు. సర్పంచ్ రాయి మేరీఅవినాష్ సమక్షంలో ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు విద్యార్థినులకు వ్యాక్సిన్లు వేశారు. పాఠశాలలోని మధ్యాహ్నం భోజనాన్ని సర్పంచ్ పరిశీలించారు. అనంతరం జిల్లేడుపాడు గ్రామంలో జరిగిన తల్లిపాలు వారోత్సవాల్లో పాల్గొని గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. అదే గ్రామంలో జరిగిన జగనన్న పాల వెలువ అవగాహన సదస్సులో సర్పంచ్ పాల్గొన్నారు.

సత్రం భూములకు బహిరంగ వేలం వేయాలి

గోకవరం: రంపయర్రంపాలెంలోని సుందరమ్మ సత్రం భూములకు బహిరంగ వేలం నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు రైతు కూలీ సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రంపయర్రంపాలెంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వీరాంజనేయులు మాట్లాడుతూ సుందరమ్మ సత్రం భూములు సుమారు 67 ఎకరాలకు పాట నిర్వహించగా అందులో 31 ఎకరాలకు ఎటువంటి డబ్బులు చెల్లించకుండా భూమిని ఖాళీగా వదిలేశారన్నారు. ఆ భూములకు వేలం పాట నిర్వహిస్తామని చెప్పి రెండు నెలలు గడిచినా ఇప్పటికీ అధికారులు వేలం నిర్వహించలేదన్నారు. తక్షణమే అధికారులు స్పందించి మిగిలిన భూములకు వేలం నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో గోలి మునలయ్య, వడ్లపాటి చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



కోటనందూరు పీహెచ్‌సీలో గర్భిణులకు భోజనం వడ్డిస్తున్న ఎంపీపీ శ్రీనివాసు



రౌతులపూడి సీహెచ్‌సీలో గర్భిణులకు పౌష్టికాహారం వడ్డిస్తున్న ప్రజాప్రతినిధులు

కోటనందూరు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష యోజనలో భాగంగా బుధవారం వైద్య పరీక్షలు చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె.ఇందిరా ప్రియదర్శిని 82 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. ఆరోగ్యంపై పలు సూచనలు చేశారు. అనంతరం వైఎస్సార్ సీపీ నాయకుడు రుత్తల జోగిరాజు ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజనాన్ని ఎంపీపీ లగుడు శ్రీనివాసు గర్భిణులకు వడ్డించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు క్రమంతప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలి

ప్రత్తిపాడు రూరల్: గర్భిణులు క్రమంతప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని పెద్దిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి ఐ.రత్నంబాబు సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో బుధవారం ప్రధాన మంత్రి మాతృత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. పీహెచ్‌సీ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 35 మంది గర్భిణులకు పీహెచ్‌సీ డాక్టర్ పి.సాహితి వైద్య పరీక్షలు చేశారు. వైద్య పరీక్షలకు వచ్చిన గర్భిణులకు గ్రామానికి చెందిన పి.రాజేష్ భోజన సదుపాయం కల్పించారు. హెల్త్ సూపర్ వైజర్లు పీఎస్ఎస్ మూర్తి, సీత, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

రౌతులపూడి: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో బుధవారం ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష యోజనలో భాగంగా గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య పరీక్షల కోసం వచ్చిన గర్భిణులకు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ ఆర్థిక సహకారంతో పౌష్టికాహారం పంపిణీ చేశారు. తొలుత ఆసుపత్రి వైద్యాధికారి జానకీదేవి గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. గర్భిణులు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చిన్నదివాణం, ప్రత్తిపాడు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జిగిరెడ్డి రమణమ్మ, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ వాసిరెడ్డి భాస్కరబాబు గర్భిణులకు పౌష్టికాహారం వడ్డించారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ పులి మధు, వైద్యులు సునీత, రాధాకృష్ణ, సౌమ్య, రాము తదితరులు పాల్గొన్నారు.



తేటగుంటలో గర్భిణులకు పౌష్టికాహార కిట్లు, మొక్కలను పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

తుని రూరల్: తల్లీబిడ్డల సంపూర్ణ ఆరోగ్యానికి పౌష్టికాహారం ఎంతో అవసరమని తేటగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ కె.అన్వేషి అన్నారు. తేటగుంట పీహెచ్‌సీలో గర్భిణులకు బుధవారం వైద్య పరీక్షలు చేశారు. అనంతరం తుని రోటరీక్లబ్ సభ్యులు సమకూర్చిన పౌష్టికాహారం, మందుల కిట్లు, పర్యావరణ పరిరక్షణకు మొక్కలను గర్భిణులకు పంపిణీ చేశారు. గర్భిణులకు ఆరోగ్యంపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కేఎల్ఎల్ఎస్ వర్మ, కర్రి కిషోర్‌రెడ్డి, కోరుకొండ గణేష్, బుచ్చిరాజు, ఎన్.సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.